క్లుప్తంగా

యంగ్ జనరేషన్ సంస్థ సేవలు మరువరానివి



తెనాలిఅర్బన్: యంగ్ జనరేషన్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. యంగ్ జనరేషన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ముగ్గురు వికలాంగులకు ట్రై సైకిల్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే 180 మంది పేదలకు దుప్పట్లు, భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యంగ్ జనరేషన్ సంస్థ వ్యవస్థాపకులు సాధిక్, 22వ వార్డు కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, చైతన్య కాలేజ్ ప్రిన్సిపాల్ సునీల్, విజయలక్ష్మి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలను ఉపయోగించుకోండి



తెనాలిఅర్బన్: ఆర్టీసీ పరిధిలో కొనసాగుతున్న కార్గో కొరియర్, పార్శిల్ సర్వీసు సేవలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ కోరారు. ఆర్టీసీ ద్వారా కొరియర్ పంపించిన వారికి డోర్ డెలివరీ కూడా చేస్తున్నట్లు చెప్పారు. కొరియర్ సేవలు కేవలం రూ.70లోకే అందించడం జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం డోర్ డెలివరీ మాస మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇది నవంబర్ 25వరకు కొనసాగుతుందని చెప్పారు. ఈ సేవలను ఉపయోగించుకొని ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు.

పరిశోధనాత్మక ఆలోచనలు చేయాలి



తెనాలిఅర్బన్: పరిశోధనాత్మక ఆలోచనలను విద్యార్థులు కలిగి ఉండాలని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల కమిటీ అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు, ప్రిన్సిపాల్ చింతల శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొత్తపేటలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో సైన్స్ ఎక్స్‌పోను శనివారం ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలను పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం వలన విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందే అవకాశం ఉందన్నారు. సృజనాత్మక, పరిశోధనాత్మక అంశాల్లో విద్యార్థులు భాగస్వాములుగా చేసేందుకు ఆర్ట్స్, క్రాఫ్ట్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బొల్లిముంత శివరామకృష్ణ, అధ్యాపకులు విజయలక్ష్మి, మహాలక్ష్మి, గోగిరెడ్డి వెంకట సుబ్బారావు, నయబ్ రసూల్, బాలకృష్ణ, వెంకటకృష్ణ, కళ్యాణ్‌కుమార్, ఐనంపూడి రజని, హేమలత, శ్రీసుధ, అపర్ణ పాల్గొన్నారు.

మందుబాబులపై కేసులు

తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి రూరల్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం, చినపరిమి డొంకరోడ్డులో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు శనివారం రాత్రి గుర్తించారు. ఐదుగురికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కేసులు నమోదు చేశారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కేఎల్‌యూ ఒప్పందం

తాడేపల్లిరూరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కేఎల్‌యూ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుని ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నట్లు యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు వెల్లడించారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్‌యూలో ఏర్పాటు చేసిన రక్తదాన అవగాహన సదస్సుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేసిన విద్యార్థులు ఓ వ్యక్తి నిండు ప్రాణంతోపాటు ఒక కుటుంబానికి భరోసా కల్పించిన వారు అవుతారన్నారు. రక్తదానం చేసిన వారికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఇచ్చే సర్టిఫికెట్ విద్యార్థులకు ఉద్యోగ అన్వేషణ సమయంలో చాలా ఉపయోగపడుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల జాబితాలో కేఎల్‌యూ విద్యార్థులు రక్తదానం చేయడంలో ముందజలో ఉన్నారన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కలసి పనిచేయడం తమకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్‌రామ్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, యూత్ రెడ్‌క్రాస్ ప్రొఫెసర్ ఇన్‌ఛార్జి డాక్టర్ కె. సుకీర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పురాణాలను ప్రగతిశీల భావాలతో పునర్లిఖించాలి

- విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ
- పంపాతీరం నవలపై చర్చా



మాట్లాడుతున్న అరసవిల్లి కృష్ణ, వేదికపై బండ్ల మాధవరావు, నాగేశ్వరరావు, వాసు

తెనాలి: మానవ సమాజాన్ని అసమానతలకేసి నడపటంలో ముఖ్యమైన పాత్రను పోషించిన పురాణాలను ప్రగతిశీల అభ్యుదయ భావాలతో పునర్లిఖించాలని విప్లవ రచయితల సంఘం(విరసం) రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ అభిప్రాయపడ్డారు. జ్యోతిబా పూలే ఇందుకో మార్గం వేస్తే, త్రిపురనేని పునాది వేయటానికి తోడ్పడ్డారని చెప్పారు. ఆ పరంపరంలో చలం నుంచి నేటి ఓల్గా వరకు పురాణ ఇతిహాసాల్లోని ఏదొక సారాంశాన్ని మేధో ప్రపంచంలో నాటేందుకు కృషి చేశారని అన్నారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా రచన «పంపాతీరం నవలపై శనివారం రాత్రి ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో చర్చా వేదిక నిర్వహించారు. అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ రాముడు పేరుతో దేశాన్ని హిందుత్వ రాజకీయం వైపు పయనింపజేసే విధానాన్ని, అందులోని రాజకీయ పార్శ్వాన్నీ అర్థం చేసుకుని శబరి రూపంలో ఓల్గా తన రచనలో బహిర్గతం చేసినట్టు వివరించారు. ఇలాగే ముందుకెళితే దేశం మరింత వెనక్కు వెళుతుందని హెచ్చరించారు. ప్రముఖ కవి, కవిత సంపాదకుడు బండ్ల మాధవరావు తన ప్రసంగంలో, రాజ్యం ప్రకృతినీ, అందులోని మనుషులపై చూపే క్రౌర్యాన్ని ఓల్గా హృద్యంగా రాసినట్టు చెప్పారు. రామాయణంలోని శబరి పాత్రతో వర్తమాన పరిస్థితులను ఆసక్తికి చెప్పారనీ అన్నారు. సమన్వయకర్త జీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్కృతి పేరుతో భావజాలం వ్యాప్తి జరుగుతోందని, చనిపోతూ హేరామ్ అనీ, చంపుతూ జైశ్రీరామ్ అంటున్నారని చెబుతూ ఏ రాముడివైపు ఉండాలో మనమే నిర్ణయించుకోవాలన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ పిల్లి వాసు మాట్లాడారు. తొలుత ఆహ్వానం లక్ష్మిని స్మరించుకున్నారు. పంపాతీరం రచన గురించి, ఆహ్వానం లక్ష్మితో తన అనుబంధాన్ని వివరిస్తూ ఓల్గా పంపిన ఆడియో సందేశాన్ని వినిపించారు. జుగాష్ విలి పర్యవేక్షించారు.

సురక్షతో ప్రజలకు ఆరోగ్య భరోసా

మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు



సచివాలయ ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ ఎం.జశ్వంతరావు

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజల ఆరోగ్యానికి ఎంతో భరోసా కల్పిస్తోందని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు కాలనీలోని సచివాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. అక్కడ అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయా వార్డుల ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. శనివారం మెడికల్ క్యాంప్‌లో జనరల్ మెడిసిన్ ఓపీ 92, ఆర్థోపెడిక్ ఓపీ 22, సైకియాట్రిక్స్ ఓపీ 20, ఆప్తమాలజీ ఓపీ 45మందిని పరీక్షించినట్లు చెప్పారు. రోగులకు డాక్టర్ వి.దేవికావాణి, డాక్టర్ సిహెచ్.గాయత్రీదేవి, డాక్టర్ వి.మౌనిక, డాక్టర్ టి.భార్గవి, డాక్టర్ వి.మహితలు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ తోక శిరీష, ఏఎంఓ హెచ్ ప్రభాకర్‌రెడ్డి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొడాలి సౌజన్య పాల్గొన్నారు.

వైకుంఠపురం ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా సాయిబాబు

- తొమ్మిది మందితో నూతన పాలకవర్గం నియామకం
- నవంబరు 9న ప్రమాణ స్వీకారోత్సవం



ఎమ్మెల్యే శివకుమార్‌తో నూతన పాలకవర్గం

తెనాలి: పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురం ఆలయ ట్రస్టుబోర్డు నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. ట్రస్టుబోర్డు చైర్మన్‌గా కుంభం సాయిబాబు, సభ్యులుగా దేవరకొండ శంకరరావు, మావులూరి శ్రీనివాసరావు, బొద్దులూరి లక్ష్మీసరస్వతి, దేవరకొండ వెంకటరమణ, కురగంటి సునీత, బట్టు దుర్గారావు గురుస్వామి, ముంత దుర్గాప్రసాద్, కనికిచర్ల చరణ్ రత్న సందీప్, వంగల జగదీశ్వరి నియమితులయ్యారు. తమ నియామకానికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను శనివారం గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతన ఆలయ పాలకవర్గం కలసి ధన్యవాదాలు తెలిపారు. పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం నవంబరు 9వ తేదీన జరుగుతుందని చెప్పారు. వీరితో జగ్గడిగుంటపాలెం సర్పంచి కుంభం బాలాజీ, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, పార్టీ నాయకులు చట్టు శ్రీనివాసరావు, గరికా శ్రీనివాసరావు ఉన్నారు.

పేదలకు సంక్షేమం అందించటమే ప్రభుత్వ ధ్యేయం

జనసేన నేతలపై వైఎస్సార్ సీపీ నేతల ఆగ్రహం

తెనాలి: సామాజిక సాధికార యాత్రపై జనసేన నాయకుల విమర్శలు అర్థరహితమని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో పార్టీ నేతలు దేసు శ్రీనివాసరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, పట్టణ–2 అధ్యక్షుడు/కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, కౌన్సిలర్ మొగల్ అహ్మద్ మాట్లాడారు. సామాజిక న్యాయం అంటే తెలీన అజ్ఞానంతో జనసేన నాయకులు మాట్లాడారని ఎద్దేవా చేశారు. బ్రీఫ్‌కేస్‌తో వచ్చిన మీ నాయకుడు తర్వాత సొంత ఇల్లు, వ్యవసాయ క్షేత్రంతో అభివృద్ధి చెందిన వైనం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేయటమే అభివృద్ధి అనేది తమ పార్టీ, తమ నాయకుడు చెప్పిన అర్థంగా తెలిపారు. వైఎస్సార్ ఫొటోతో రెండుసార్లు ఇక్కడ గెలిచి శాసనసభలో అత్యున్నత పదవిని పొందిన నాదెండ్ల మనోహర్, తర్వాత రెండు పర్యాయాలు రెండు పార్టీల్నుంచి పోటీచేసి ఎందుకు గెలవలేకపోయారని దుబాయ్‌బాబు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానికంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మైనారిటీలకు పెద్దపీట వేశారని కౌన్సిలరు మొగల్ అహ్మద్ చెప్పారు. జనసేన పార్టీతో పొత్తే మిటని టీడీపీ నాయకులే కార్యకర్తల సమావేశంలో విమర్శిస్తున్నారని తిరుమలశెట్టి శ్రీనివాసరావు చెబుతూ జనసేన నేతలు ముందుగా ఆ పంచాయితీని తేల్చుకోవాలని అన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పట్టణ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, పార్టీ నేతలు బూరెల దుర్గాప్రసాద్, వుప్పల వరదరాజులు, కొమ్ము రాయల్, కాళిదాసు విజయసత్యం, కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, ఇస్మాయిల్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, చుండూరు సాయి, పోతురెడ్డి నాగరాజు, మల్లెబోయిన రాము, కఠారి హరీష్, అత్తోట చంటి, నాలాది ప్రభాకర్ పాల్గొన్నారు.

త్రిశక్తి స్వరూపిణి తులసీ పార్వతీదేవి



కంఠంరాజుకొండూరు(తెనాలి): ధైర్యవంతుడు, విద్యావంతుడు, సేవచేసేవారు గొప్పవారుగా కీర్తిని పొందుతారని, ఆ మూడు సద్గుణాలు కలిగిన డాక్టర్ పోలవరపు తులసీ పార్వతీదేవి త్రిశక్తి స్వరూపిణిగా చిత్తూరు జిల్లా, ఏర్పేడులోని వ్యాసాశ్రమ వ్యాస పీఠాధిపతులు పరిపూర్ణానందగిరి స్వామి అభివర్ణించారు. ప్రవాస భారతీయురాలు డాక్టర్ పోలవరపు తులసీపార్వతీదేవి స్వస్థలమైన దుగ్గిరాల మండల గ్రామం కంఠంరాజుకొండూరులోని కారుమంచి గోవిందయ్య ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన మెమోరియల్ బ్లాక్‌ను, ఆమె కాంస్యవిగ్రహాన్ని శనివారం శ్రీపరిపూర్ణానంద గిరి స్వామి ఆవిష్కరించారు. సభకు కారుమంచి రత్తమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, డాక్టర్ పోలవరపు రాఘవరావు అధ్యక్షత వహించారు.కోశాధికారి డాక్టర్ జెట్టి ప్రసాద్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ కల్పన రఘునాథ్, డాక్టర్ పిన్నమనేని ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చదలవాడ సుధ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం, శ్రీకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



అమరావతి వాల్మీకి సేవాసమితి ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి గ్రామస్తులు

తాడేపల్లిరూరల్: రామాయణ గ్రంథసృష్టికర్త, ఆదికవి, మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను శనివారం ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలెం ఇండస్ట్రీ కాలనీలో అమరావతి వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు మాట్లాడుతూ రామాయణ గ్రంథం ద్వారా మానవ జీవన విధానం, మనుషుల మధ్య అనుబంధాలు తెలియజేయడమే కాకుండా లోక కళ్యాణం కోసం పాటుపడాలని తెలియజేసిన గొప్ప వ్యక్తి వాల్మీకి అని అన్నారు. వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ జీవితంలో చెడు అలవాట్లను వదిలిపెట్టి మంచి పనులను చేస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని వారు సూచించారు. వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, నియోజకవర్గ యువజన అధ్యక్షులు ఆలా శివాజీ, జిల్లా మహిళా కో ఆర్డినేటర్ స్వాతి, బీసీ సంక్షేమ సంఘం కళామతల్లి రాష్ట్ర అధ్యక్షులు ముప్పాన వెంకటేశ్వర్లు, అమరావతి వాల్మీకి సేవా సమితి కమిటీ అధ్యక్షులు నల్లబోతుల లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు కామినేని సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి మినుగు రామకృష్ణ, కోశాధికారి మైల రవీంద్రబాబు, కార్యదర్శులు నల్లబోతుల సుబ్బారావు, మినుగ పవన్‌కుమార్, మైల శ్రీనివాస్, నల్లబోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాడికొండలో...

తాడికొండ: రామాయణ మహాకావ్య రచన చేసిన వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శమని తాడికొండ గ్రంథాలయాధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని తాడికొండ శాఖా గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, రంగారావు, పులి హనుమయ్య, ఎస్.అప్పారావు, ఎస్.చలపతి రావు, జి.సత్యన్నారాయణ, ప్రసాద్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటి నుంచి పల్లెకు పోదాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

తూములూరు(కొల్లిపర): నవంబర్ ఒకటో తేదీ నుంచి పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.విజయలక్ష్మి కోరారు. మండల పరిధిలో తూములూరులోని పాలకేంద్రం కల్యాణ మండపంలో దావులూరు, చక్రాయపాలెం, తూములూరు, అన్నవరం, బొమ్ముువానిపాలెం ఆయా గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్లకు పల్లెకు పోదాం కార్యక్రమంపై అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పల్లెకు పోదాం కార్యక్రమం విజయవంతం చేయాల్సిన బాధ్యత సచివాలయం సిబ్బందిపై ఉందన్నారు. మండలంలో కొంత మంది వలంటీర్లు పనితీరు సక్రమంగా లేదని అటు వంటి వారిపై తగిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, ఈద హర్షవర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, పరిపాలనాధికారి వి.చంద్రమోహన్, సీనియర్ అసిస్టెంట్ భీమవరపు మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

తల్లీ, బిడ్డల అదృశ్యం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కనిపించకుండా పోయిన తల్లీకొడుకుల సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. నవులూరు చెందిన హనోక్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళగిరి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నవులూరుకు చెందిన గోరికెపూడి రోజా కొల్లూరు మండలం, దోనేపూడిలో భర్తతో కలసి నివాసముంటోంది. దసరా పండుగ సందర్భంగా నవులూరు వచ్చిన రోజా ఈనెల 24వ తేదీన తిరిగి దోనేపూడి వెళ్లింది. అయితే ఆమె ఇప్పటి వరకు ఇంటికి చేరలేదు. భర్త రోజా రాలేదని రోజా తమ్ముడైన ఆళ్ళమూడి హనోక్ బాబుకు తెలియజేశారు. అప్పటి నుంచి చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో విచారించారు. 24వ తేదీ మంగళగిరి బస్టాండ్‌లో రోజాను తెనాలి బస్సు ఎక్కించామని, ఏమైందో ఏమిటో తెలియదు కానీ రోజాతో పాటు ఆమె కుమారులైన శామ్యూల్, ప్రేమ్ కుమార్‌లు కూడా కనిపించడం లేదని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న ఆరోగ్యాధికారి డాక్టర్ దేవిక వాణి

తెనాలిఅర్బన్: క్షయవ్యాధిపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవిక వాణి సూచించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో తెనాలి పట్టణంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు చంద్రబాబునాయుడు కాలనీలో శనివారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ తెనాలి సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్, 23వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు జి.సుబ్రహ్మణ్యం, డెప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, హెల్త్ విజిటర్ నాదెళ్ల లక్ష్మి, దాసరి విజయకుమారి పాల్గొన్నారు.

తెనాలిలో టీడీపీ దీక్షా శిబిరం ఎత్తేశారు



ఖాళీగా కనిపిస్తున్న దీక్షా శిబిరం ప్రదేశం

తెనాలి: తమ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు ఇప్పట్లో జైలు నుంచి విముక్తి ఉండదని భావించారో? మరే కారణంచేతనో టీడీపీ దీక్షా శిబిరాన్ని ఎత్తేశారు. చంద్రబాబుకు అరెస్టుకు వ్యతిరేకంగా నెలరోజులకు పైగా స్థానిక బోసురోడ్డులోని పడగొట్టిన స్వరాజ్ టాకీస్ గేటు వద్ద టీడీపీ ఆధ్వర్యంలో దీక్షాశిబిరం నిర్వహిస్తున్నారు. ఆరంభంలో హడావుడి కాస్త గట్టిగానే అనిపించినా, రానురాను దీక్షలు ప్రహసనంలా తయారయ్యాయి. ఉదయం 11 గంటల ప్రాంతంలో దీక్షా శిబిరానికి చేరుకోవటం, మీడియాతో మాట్లాడటం, మధ్యాహ్నం ఒకరి తర్వాత ఒకరు ఇళ్లకు వెళ్లి రావటం, సాయంత్రానికి బంద్ చేస్తూ వచ్చారు. కొద్దిరోజులుగా దీక్షలో నలుగురైదుగురు మించి కనిపించలేదు. దీక్షా శిబిరం నిర్వహణలో తెలుగుదేశం నేతల నీరుగారిపోయారని జనం చెప్పుకోసాగారు. ఈ గొడవంతా ఎందుకని అనుకున్నారో? చంద్రబాబుకు ఇప్పట్లో బెయిలు రావటం కష్టమనుకున్నారో? తెలియదుగానీ శనివారం ఉదయం శిబిరంలో ఉంచిన కుర్చీలు, టెంట్లు తీసుకెళ్లిపోయారు. ప్రస్తుతానికి ఇప్పుడక్కడ దీక్షాశిబిరం నడిచిన ఆనవాలు కూడా లేదు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

- దోమలను నివారించండి
- మలేరియా అడిషనల్ డైరెక్టర్ వీర్రాజు



కూలర్‌లో నిల్వఉన్న నీటిలో దోమలను చూపిస్తున్న వీర్రాజు

తాడేపల్లిరూరల్: ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా వ్యక్తిగతంగా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని గుంటూరు జోనల్ మలేరియా అడిషనల్ డైరెక్టర్ వీర్రాజు అన్నారు. శనివారం ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామి కాలనీలో ఆయన దోమల నివారణపై విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, ఇతర జ్వరాలు దోమల వల్లే వస్తాయని, ఆ దోమలను నివారించేందుకు ప్రతి ఒక్కరు తమ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి నివాసంలో దోమలు ఎక్కడ నివాసాలు ఉంటాయో అనేది ప్రత్యక్షంగా గృహిణులకు వివరించామని, సుమారు 100 గృహాలను పరిశీలించి వారి వారి ఇళ్లలో వున్న బట్టలు పెట్టుకునే ర్యాక్ లు, బీరువాల మాటు, ఇంటి పైకప్పులో దోమలు నివాసాలు ఎలా ఏర్పాటు చేసుకుంటాయో వారికి చూపించామని, అలాగే పక్కన పెట్టిన కూలర్లు, రోళ్లు, పూల కుండీలు, ఇతర మంచినీటి తొట్టిలలో దోమలు ఆవాసాలు ఎలా ఏర్పాటు చేసుకుంటాయో, వాటికి నివారణ ఏమిటో వివరించామని ఆయన తెలిపారు. దోమలు వాటి శరీర భాగాల్లో సూక్ష్మంగా ఉన్న వ్యాధి కారకాల గురించి, ఆ దోమలను నాశనం చేయడానికి ఏఏ మందులు పని చేస్తాయో, దోమల నివారణకు మందులను సైతం సూచించామన్నారు.

దోమల నివారణ ఎలాగో తెలియక ఎంతోమంది వ్యాధుల బారిన పడుతున్నారని వారికి వివరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి కోడెల శ్రీనివాసరావు, ఎ.శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్ ఎం.సాగర్, సైదులు, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, నరసింహమూర్తి, నూకరాజు, ఆశ వర్కర్ కళావతి మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మణిపాల్ హాస్పిటల్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి కృష్ణానది తీరంలో వున్న మణిపాల్ హాస్పిటల్ తమ వైద్య సేవలను గ్రామగ్రామాన విస్తరించి, క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మణిపాల్ హాస్పిటల్ విజయవాడ బ్రాంచ్ డైరెక్టర్ డాక్టర్ కంటిపూడి సుధాకర్ మాట్లాడుతూ మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ కోసం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసి ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలో అందించామన్నారు.

పవర్ లిఫ్టింగ్ కప్ పోటీలకు షేక్ సాధియా

తాడేపల్లిరూరల్: స్లొవేనియాలో ఈనెల 30 నుంచి నవంబర్ 4 వరకు జరగనున్న వరల్డ్ యూనివర్శిటీ పవర్ లిఫ్టింగ్ కప్ పోటీలకు మంగళగిరి పట్టణ పరిధికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సాధియా నేడు ప్రయాణం కానున్నట్లు కోచ్ యస్‌కె సందాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలో కె.ఎల్.యూనివర్శిటీలో షేక్ సాధియా ఎంబీఏ చదువుతున్నదని, ఈ పోటీలలో భారతదేశం నుంచి నలుగురు పవర్ లిఫ్టర్లు పాల్గొంటున్నారని, వారిలో ఆంధ్రప్రదేశ్ నుండి సాధియా పాల్గొనడం గర్వకారణమని, 57 కేజీల విభాగంలో పాల్గొని పతకం సాధిస్తుందని, సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మద్ది ప్రభాకరరావు, ఏపీ పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి సకల సూర్యనారాయణ, ఏపీ పవర్ లిఫ్టింగ్ గౌరవ అధ్యక్షులు గంట వెంకటేశ్వరరావు, విజయ భాస్కరరావు, అభినందించారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామంలోని కోదండ రామాలయంలో శనివారం వైభవంగా నవగ్రహ, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చకులు కృష్ణమూర్తి స్వామివార్లకు విశేష పూజలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు నిర్వహించారు. అనంతరం స్మార్తపండితులు నారాయణం లక్ష్మీ రఘురామ్, సాయిచందు, వినయ్‌కుమార్‌లు మండపారాధన, పంచపాలక పూజ, కళశస్థాపన, నవగ్రహ మండపారాధన నిర్వహించి లక్ష్మీగణపతి హోమం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉపకార వేతనాలు పంపిణీ



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వడ్లమూడి గోవర్ధనరావు

తెనాలిఅర్బన్: వడ్లమూడి కోటయ్య చౌదరి ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కొత్తపేటలోని ఎన్‌జీవో హోమ్‌లో విద్యలో ప్రతిభ చూపించే 92 మంది విద్యార్థులకు రూ.15.74 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వడ్లమూడి గోవర్ధనరావు, మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 27 సంవత్సరాల నుంచి అనేక సేవ కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ శారద, జీడీవీ ప్రసాదరావు, డాక్టర్ జీఏ రామారావు, కె.అజయ్‌కుమార్, వడ్లమూడి బసవప్రసాద్, వడ్లమూడి బసవరావు పాల్గొన్నారు.